ప్రజాశక్తి

బుధవారం 15 మే 2024 5

శ్రీకాకుళం



డిగ్రీ ఇంటర్న్‌షిప్ ఎగ్జామినర్ల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ ఆరో సెమిస్టర్ మే 2024 ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం ఎగ్జామినర్ల షెడ్యూల్‌ను ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎన్.ఉదయ్ భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. ఈమేరకు జిల్లాలోని డిగ్రీ కళాశాలలో లెక్చరర్లు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినేషర్లుగా నియమించారు. షెడ్యూల్ ప్రకారం ఇంటర్న్‌షిప్ మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఈ ఇంటర్న్‌షిప్ ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్నారు.

మహిళలే భేష్



- నిర్ణయాత్మక శక్తి వారే..!
- మహిళా ఓటింగ్ శాతం 78.21 నమోదు
- పురుషుల ఓటింగ్ 75.39 శాతం
- జిల్లావ్యాప్తంగా 76.80 శాతం పోలింగ్
- ఎచ్చెర్లలో అత్యధికం, శ్రీకాకుళంలో అత్యల్పం

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ 76.80 శాతం నమోదైంది. పురుషులతో పోలిస్తే మహిళలు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల ఓటింగ్ శాతం 75.39 శాతం ఉండగా, మహిళలు 78.21 శాతం మేర తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఓటింగ్ శాతం అధికంగా ఉండడంతో, వారి నిర్ణయమే అభ్యర్థుల రాతలను మార్చడంలో కీలకం కానుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 18,61,653 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 14,03,880 మంది ఈనెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలదే పైచేయి. జిల్లాలో 9,45,945 మంది మహిళా ఓటర్లు ఉండగా వారిలో 7,30,075 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మహిళల ఓటింగ్ శాతం 78.21గా నమోదైంది. జిల్లాలో 9,29,859 మంది పురుష ఓటర్లు ఉండగా, వారిలో 6,82,324 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి ఓటింగ్ శాతం 75.38గా నమోదైంది. ట్రాన్స్‌జెండర్ల ఓట్లు 130 వరకు ఉండగా, వారిలో 17 మంది మాత్రమే ఓటు వేయడంతో 13.08 శాతంగా నమోదైంది. ఓటు హక్కును వినియోగించుకోవడంలో మహిళలతో పోలిస్తే పురుషులు వెనుకబడ్డారు. దీంతో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా మహిళలే అవతరించనున్నారు.

ఎచ్చెర్లలో అత్యధిక పోలింగ్

జిల్లావ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 76.81 శాతంగా నమోదైంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 83.28 శాతం నమోదైంది. తర్వాత స్థానంలో నరసన్నపేట (82.44 శాతం), ఆమదాలవలస (81.42 శాతం), టెక్కలి (80.51 శాతం), పలాస (76.42 శాతం), పాతపట్నం (72.36 శాతం), ఇచ్ఛాపురం (70.55 శాతం) ఉన్నాయి. శ్రీకాకుళంలో అత్యల్పంగా 70.22 శాతం పోలింగ్ నమోదైంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
ఎచ్చెర్ల	2,42,895	2,11,319	83.28
నరసన్నపేట	2,13,083	1,71,532	82.44
ఆమదాలవలస	1,92,623	1,52,943	81.42
టెక్కలి	2,34,480	1,84,254	80.51
పలాస	2,18,448	1,63,705	76.42
పాతపట్నం	2,23,636	1,57,082	72.36
ఇచ్ఛాపురం	2,66,161	1,85,035	70.56
శ్రీకాకుళం	2,70,327	1,78,010	70.22

సంవత్సరాల వారీగా పోలింగ్ శాతం

నియోజకవర్గం	2014	2019	2024
ఇచ్ఛాపురం	71.32	70.15	70.55
పలాస	71.78	72.92	76.42
టెక్కలి	77.85	78.79	80.51
నరసన్నపేట	78.85	84.30	82.44
శ్రీకాకుళం	71.88	70.01	70.22
ఆమదాలవలస	76.62	78.51	81.42
పాతపట్నం	73.33	69.47	72.36
ఎచ్చెర్ల	82.38	80.00	83.28
మొత్తం శాతం	75.02	75.53	76.80





లావేరులోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)



శివానీ ఇంజనీరింగ్ కళాశాలలోని రిసెప్షన్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ (ఫైల్)

సేవలకు సలాం

- రెండు నెలలుగా సాగిన ఎన్నికల క్రతువు
- అటెండర్ నుంచి కలెక్టర్ వరకు శ్రమించిన యంత్రాంగం
- సమర్థవంతమైన పాత్ర పోషించిన పోలీసు శాఖ
- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సుమారు రెండు నెలలుగా ఎన్నికల క్రతువు సాగింది. ఎన్నికల కోడ్ మొదలైన నాటి నుంచి పోలింగ్ వరకు జిల్లా యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ నుంచి ఎన్నికల విధులతో ముడిపడి ఉన్న శాఖల అటెండర్ వరకు తీవ్రంగా శ్రమించారు. ఎన్నికల విధుల్లో ఎక్కడా ఏమరుపాటుకు తావు లేకుండా సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించడంలో యావత్తు జిల్లా యంత్రాంగం విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ మొదలు పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది వరకు రాత్రనక పగలనక పనిచేశారు. ఈనెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్‌కు మొత్తం 17,373 మంది సిబ్బంది పనిచేశారు. వీరితోపాటు కంట్రోల్‌రూమ్‌లో మూడు షిఫ్టుల్లో పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 గంటలూ పనిచేశారు. పోలింగ్ రోజు అధికారులు, సిబ్బంది మరింత శ్రమించారు. ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో రాత్రి 11 గంటల తర్వాత పోలింగ్ ముగియడంతో, ఆ తర్వాత బస్సుల్లో బయలుదేరి ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. వాహనాలను ఎక్కడా ఆపే పరిస్థితి లేకపోవడంతో, భోజనాల్లేకుండానే ఇళ్లకు తిరిగి వెళ్లారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఉదయం ఏడు గంటలకే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ నుంచి ఎన్నికలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా వస్తున్న ఎల్ఇడి స్క్రీన్లపై వస్తున్న ప్రసారాలను వీక్షిస్తూ ఆర్ఒలు, సెక్టార్ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత కంట్రోల్‌రూమ్ నుంచి బయలుదేరి ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకుని ఇవిఎంల డిపాజిట్లను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో భాగమే అయినా కలెక్టర్ చురుగ్గా కదలడం మిగిలిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో స్ఫూర్తిని నింపింది.

శభాష్ పోలీస్

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడం వెనుక పోలీసు శాఖ కీలకపాత్ర పోషించింది. పోలింగ్ మొదలైన క్షణం నుంచి ముగిసే వరకు చాలా అప్రత్తమంగా వ్యవహరించారు. జిల్లాలో అక్కడక్కడా జరిగిన ఘటనలు వెంటనే సద్దుమణిగేలా చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గొడవ తీవ్రతరమవుతున్న ప్రాంతాలకు వెంటనే బలగాలు చేరుకుని, ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడంలో తమవంతు పాత్ర పోషించాయి. పోలింగ్ ప్రక్రియలో జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసింది. ఇందుకోసం సుమారు రెండు నెలలుగా ఎక్సైజ్, పోలీస్ అధికారులు తీవ్రంగా శ్రమించారు. రెండు రోజులుగా హోంగార్డు స్థాయి నుంచి ఎస్‌పి వరకు రాత్రీ పగలు తేడా లేకుండా పనిచేసి, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని సృష్టించారు. పోలింగ్ రోజు విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని, ఎస్‌పి జి.ఆర్ రాధిక జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించడం, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వంటి చర్యలతోనే జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. దీంతోపాటు ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు ప్రచారం నిర్వహించే సమయంలో భద్రత కల్పించే విషయంతో పాటు జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలు, రోడ్‌షోలకు వచ్చిన స్టార్ క్యాంపెయినర్ల భద్రత విషయంలో అప్రమత్తంగా వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకున్నారు.

టెంట్లలోనే విధులు

ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత మద్యం, నగదు అక్రమ రవాణను అరికట్టేందుకు పోలీసుశాఖ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. మండుటెండలో సైతం ఆ టెంట్లలోనే విధులు నిర్వర్తించారు.ఎన్నికల్లో అక్రమ మద్యం పంపిణీ అరికట్టేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ముందు నుంచే జిల్లాలోని బెల్టుషాపులపై దాడులు నిర్వహించి, పలువురిపై కేసులు నమోదు చేశారు. తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల్లో పంపిణీ చేయడం కోసం తరలిస్తున్న మద్యాన్ని, స్టాక్‌ను నిల్వ చేసుకొని అధిక ధరలకు మద్యాన్ని విక్రయించేందుకు దాచి ఉంచిన వాటిని దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. రెండు నెలలుగా ఎన్నికల వాతావరణం కొనసాగడంతో ప్రచారం, బహిరంగ సభలు, మద్యం, నగదు పట్టివేతలతో బిజీగా గడిపారు. జిల్లావ్యాప్తంగా రూ.4.40 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక (ఫైల్)

ఓటమి భయంతోనే వైసిపి దాడులు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

ఓటమి భయంతోనే వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం టిడిపి శ్రేణులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. మందస మండలం హరిపురం, పలాస మండలంలోని అమలకుడియా, పెదంచల, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబాడాంకు చెందిన టిడిపి నాయకులు పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఏజెంట్లుగా ఉండడంతో, వారిపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలన్నారు. రాజకీయాలు హుందాగా చేయాలి తప్ప ప్రత్యర్థులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. టిడిపి నాయకులపై దాడికి సంబంధించి ఎస్‌పి, కాశీబుగ్గ డిఎస్‌పికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించిన పలాస నియోజకవర్గ ప్రజలకు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, కె.నర్సింహులు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

స్ట్రాంగ్‌రూముల్లో ఇవిఎంలు

మూడంచెల భద్రత ఏర్పాటు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలింగ్ ప్రక్రియ ముగియడంతో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన ఇవిఎంలను భారీ పోలీసు బందోబస్తు మధ్య స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఆయా నియోజకవర్గాలకు చెందిన రిటర్నింగ్ అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో మంగళవారం ఉదయం వాటికి సీల్ వేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇవిఎంలు నిక్షిప్తం చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటిబిపి) కేంద్ర భద్రతా దళాలు పహారా కాయనుండగా, దాన్ని వెలుపుల వైపు రాష్ట్ర రిజర్వు పోలీస్ దళాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. కళాశాల చుట్టుపక్కల మరో బృందం షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తాయి. ఇలా మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిరంతరం సిసి కెమెరాల నిఘాతో పాటు రికార్డింగ్ కూడా చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించి పలు అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఓటింగ్ ప్రక్రియ ముగియగానే సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సీల్ చేసిన ఇవిఎంలు, వివి ప్యాట్‌లు, జిపిఎస్ అనుసంధానం చేసిన ట్రాకింగ్ వాహనాలు చిలకపాలెం చేరుకున్నాయి. వాటిని అభ్యర్థుల సమక్షంలో లెక్కింపు కేంద్రమైన శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో చేర్చారు. మంగళవారం వాటికి సీల్ వేశారు. ఓట్ల లెక్కింపు జూన్ నాలుగో తేదీన జరుగనుంది. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఇవిఎంలు, వివిప్యాట్‌ల భద్రతపై ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కార్యక్రమంలో మరో ఎన్నికల పరిశీలకులు సందీప్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేయిస్తున్న అధికారులు



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జిలా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఎపిఆర్‌డిసిలో మహేష్‌కు 48వ ర్యాంకు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యార్థి కూరాకుల మహేష్ ఎపిఆర్‌డిసి ఫలితాల్లో సత్తా చాటాడు. ఎపి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షలో 86 మార్కులతో 48వ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు డిగ్రీలో ఉచితంగా రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఎపిఆర్‌డిసి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ పరీక్ష కోసం వేల సంఖ్యలో విద్యార్థులు పోటీపడుతుంటారు. బూర్జ మండలం అన్నంపేటకు చెందిన వ్యవసాయ కూలీ కూరాకుల సూర్యనారాయణ, సన్యాసమ్మ కుమారుడు మహేష్ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు.



ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 889 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. అదే ఏడాది మాస్టర్ మైండ్స్ సంస్థ నుంచి నగదు పురస్కారం కూడా పొందాడు. ఎస్ఎస్ఎస్ పిజి దుగ్గివలస రాంప్రసాద్, కామర్స్ అధ్యాపకులు బి.సంగీత సహకారంతో తాను ఈ ర్యాంకు సాధించగలిగానని మహేష్ తెలిపాడు. మహేష్‌ను కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రిజర్వాయర్‌లో మునిగి బాలుడు మృతి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పారాపురం రిజర్వాయరులో స్నానానికి వెళ్లిన చీమలవలస అభి (13) మంగళవారం మృతి చెందాడు. బూర్జ మండల కేంద్రానికి చెందిన శ్రీహరి భార్య జయమ్మ ఈనెల 13న ఓటు వేసేందుకు కన్నవారి ఊరు పారాపురం వచ్చింది. పిల్లలకు వేసవి సెలవులు కావడంతో రెండు రోజులు అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం సాయంత్రం తల్లీ కుమారుడు వాకింగ్‌కు వెళ్లారు. అనంతరం రిజర్వాయరులో స్నానానికి దిగారు. స్నానం చేస్తున్న సమయంలో అభి లోపలకు వెళ్లడంతో మునిగిపోయాడు. జయమ్మ రక్షించేందుకు ప్రయత్నించగా, అప్పటికే మునిగిపోయాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అభిని బయటకు తీశారు. 108లో కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధర్మాన కిషోర్‌కుమార్ ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి శ్రీహరి లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. మృతుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సెలవులకు గడిపేందుకని వచ్చి విగతజీవిగా మారడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అభి మృతదేహం



టెక్కలి : అవగాహన కల్పిస్తున్న జడ్జి తేజ చక్రవర్తి

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - టెక్కలి

జ్యుడీషియల్ కోర్టు పరిధిలోని వివిధ రకాల కేసులపై వచ్చే కక్షిదారులకు మధ్యవర్తిత్వంగా వ్యవహరించే న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి మల్లా తేజ చక్రవర్తి అన్నారు కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్ర వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఇందుకు కావలసిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వివేకానంద, న్యాయవాదులు దివాకర్ వెంకటరావు, రాజేశ్వరరావు, వైకుంఠరావు, ఆనంద్ పాల్గొన్నారు.

సోంపేట: పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్య వర్తిత్వానికి ప్రాధాన్యత ఉందని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక కోర్టుల సముదాయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు మధ్యవర్తిత్వం కాన్సెప్ట్ నోట్‌పై అవగాహన కల్పించారు. సదస్సులో సోంపేట బార్ ప్రెసిడెంట్ ఎం.సర్వేశ్వరరావు, బార్ సెక్రటరీ డి.జగన్నాయకులు, ఎజిపి బి.లక్ష్మీనారాయణ, జి.పున్నయ్య, విజయకుమార్, డి.జోగారావు, రుక్మాంగదుడు, ఎ.కె.వి.వి.ప్రసాద్, జి.ఎస్.వి.వి.విజయకుమార్, విశ్వనాథం నాయుడు పాల్గొన్నారు.

జనసైనికులు క్రమశిక్షణతో పనిచేశారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



దానేటి శ్రీధర్

జిల్లాలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు నిర్వహించడంలో అన్ని విభాగాల అధికారుల పనితీరు అభినందనీయమని, అలాగే జనసైనికులు క్రమశిక్షణతో పనిచేశారని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు మెడికవర్‌లోని ఆయన ఛాంబరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలు కల్పించారన్నారు. ఓటు హక్కు వినియోగంలో చైతన్యం తేవడంలో యువకులు, మహిళలు ఈ సారి ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. ఓటింగ్ శాతం పెరగడం అభివృద్ధికి సూచికంగా భావిస్తున్నారన్నారు. యువత అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడంతో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తున్నట్లు స్పష్టంగా ఓటింగ్ సరళి కనిపిస్తుందని అన్నారు.

పాముకాటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - నందిగాం



శివానంద (ఫైల్)

మండలంలోని పెద్దలవునిపల్లికి చెందిన లఖినాన శివానంద (21) పాముకాటుకు మృతి చెందారు. వేసవి కావడంతో సోమవారం రాత్రి తలుపులు తీసి నిద్రించారు. అర్ధరాత్రి తరువాత పాము కాటు వేసింది. నిద్రలో గమనించకపోవడంతో మంగళవారం ఉదయానికే అపస్మారకస్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి తల్లి పార్వతి, సోదరుడు పవన్ కుమార్ ఉన్నారు. మృతుడి డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


కాయ్ రాజా కాయ్

గెలుపుపై ఎవరి ధీమా వారిది

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా తలపడ్డారు. ఈ సారి తమ పార్టీ విజయం తథ్యమని వైసిపి, భారీ మెజారిటీతో అఖండ విజయం సాధిస్తామని టిడిపి నేతలు బెట్టింగ్‌లు కట్టుకోవడం కనిపించింది. ఈ సారి ఫలితాల గెలుపు తమది అంటే... తమదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కంచుకోటలో ఎలాగైనా ఈసారి ఎన్నికల్లో జెండా పాతాలని గట్టి పట్టుదల, వ్యూహంతో అధికార పార్టీ వైసిపి అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. సంక్షేమ పథకాలు ఎరతో విజయం సాధించాలన్న కొంత అనుమానం ఉంది. కానీ, చివరి క్షణంలో దాదాపు లక్ష యాభై వేలు ఓట్లు కొల్లగొట్టాలన్న మాస్టర్ ప్లాన్‌తో యుద్ధ భూమిలో దిగింది. ఈ మాస్టర్ ప్లాన్‌లో సమన్వయం కొరవడం వల్ల అనేక గ్రామాల్లో, వార్డుల్లో బెడిసి కొట్టినట్లు కనబడుతోంది. ప్రతిపక్ష పార్టీ టిడిపి నాయకులు గ్రామస్థాయిలో కేడర్ అధికార పార్టీకి ఏమీ తక్కువ కాకుండా ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు.

నియోజకవర్గంలో మొత్తం సైలెంట్ ఓటింగ్ జరగడం వల్ల ఇరు పార్టీలకు దడ మొదలైంది. పెద్దఎత్తున డబ్బులు వెదజల్లినా ఇంకా అనుమానమే. పథకాలు, వాలంటీర్లపైనే అధికార పార్టీ గట్టి నమ్మకంతో ఉంది. కానీ, అధికార పార్టీ నాయకుల్లో గెలుపుపై పూర్తిస్థాయిలో నమ్మకం కుదరడం లేదు. మహిళలు భారీస్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం వల్లే మాకే అనుకూలమనే, మహిళా ఓటింగ్ శాతం కూడా పెరగడం కలిసివచ్చే పరిస్థితి ఉందని వైసిపి నేతలు భావిస్తున్నారు. టిడిపి మాత్రం వైసిపి దౌర్జన్యాలకు, బెదిరింపులకు భయపడి సైలెంట్‌గా వైసిపికి ఇంటికీ పంపించే ఏర్పాట్లలో ఓటర్లు ఉన్నారని, అందుకే బహిర్గతం చేయడం లేదని అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఈ నియోజకవర్గంలో కంచుకోట ముట్టడి సాధ్యం కాదని టిడిపి నేతలు అంటున్నారు. డబ్బులు అందుకున్న ఓటర్లు కనీసం పూర్తి స్థాయిలో ఓటింగ్ రాలేదని, రాష్ట్రవ్యాప్తంగా కూటమి గెలుపు పవనాలు వీస్తున్నాయని టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నాడు జరిగిన పోలింగ్‌లో 69.77 శాతం పోలయ్యాయి. ఇందులో పురుషులు 84.356, మహిళలు.10,2778 మంది , మారో ఇద్దరు థర్డ్ జండర్లు



ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు 18,422 మంది అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈసారి ఎవ్వరుని దించినా, గద్దె ఎక్కించినా ఈ మహిళా ఓటర్లు కీలకంగా మారాయి. ఈ మహిళా ఓటర్లపై రెండు పార్టీలూ ఆశలు పెట్టుకున్నాయి. సంక్షేమ పథకాలు. డబ్బు తమని గెలిపించే అవకాశాలు మెండుగా ఉన్నాయని అధికార పార్టీ ధీమా. ప్రభుత్వంగా వ్యతిరేకంగా ఉన్న అంగన్వాడీ, ఆశావర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా మహిళలే కదా, అందులోనూ తమ పార్టీకే అనుకూలమని టిడిపి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుంది. మొత్తం మీద రెండు పార్టీలూ ఓటర్లు ఎటువంటి తీర్పు ఇచ్చారో జూన్ 4వ తేదీ వరకు వేచిచూడక తప్పదు. అప్పటి వరకు రెండు పార్టీల శిబిరాల్లో బూత్‌ల స్థాయిలో లెక్కలు వేసుకుంటూ అక్కడ మాకు మెజారిటీ, ఇక్కడ మాకు మెజారిటీ అంటూ అంచనాలు వేస్తున్నారు.

కామినాయుడు చెరువు ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురంలోని కామినాయుడు చెరువును మంగళవారం అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కబ్జా చేయడానికి యంత్రాలతో సిద్ధమయ్యారు. చెరువు గర్భం లోపల భాగంలో సుమారు ఏడెకరాల భూమిని వైసిపి నాయకులు గొల్లపల్లి మోహనరావు, గొల్లపల్లి కాంతారావు, గొల్లపల్లి జగదీష్ ఆక్రమణకు యత్నించారు. మంగళవారం ఆక్రమించిన చెరువు గర్భ భూములను యంత్రాలతో గట్టులు వేస్తూ... హద్దులు నిర్ణయిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని భూ ఆక్రమణను అడ్డుకున్నారు. 60 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువును



అడ్డుకుంటున్న 'ఉపాధి' కూలీలు

ఇప్పటికే ఎంతోమంది భూములుగా ఆక్రమించారని, ఉన్న చెరువు గర్భం ఆక్రమణకు గురైతే ఉపాధి పనులు నిర్వహించడానికి అవకాశాలు ఉండవని కూలీలు ఆందోళనతో భూ ఆక్రమణ పనులను అడ్డుకున్నారు. అయినా భూ ఆక్రమణదారులు పెడచెవిన పెట్టి యంత్రాలతో యదేచ్ఛగా హద్దులను నిర్ణయిస్తూ గట్టును వేశారు. దీంతో గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ... వారిపై తిరగబడ్డారు.

దీనితో భూ ఆక్రమణదారులు అక్కడ నుంచి పరారీ కావడంతో అదే యంత్రాలతో గ్రామస్తులు ఆక్రమణదారులు సదులు చేసిన చెరువు గర్భ భూముల హద్దుల గట్టులను చెరువుగా మార్చారు. ఇదే విషయాన్ని ఫొటోలు, వీడియోలు గ్రామస్తులు చిత్రీకరించి తహశీల్దార్ కామినాయుడుకు పంపించారు. తరువాత చాలాసార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు ఆక్రమణకు గురైతే సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుందని వాపోయారు. తహశీల్దార్ స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



రక్తదానం చేస్తున్న గొండు శంకర్

గొండు శంకర్ రక్తదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిన్నటి వరకు ఎన్నికల ప్రచారంలో చేసి బిజీగా ఉన్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అలసటను మరచి అత్యవసర పరిస్థితుల్లో మంగళవారం రక్తదానం చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఆయనతో పాటు డిసిసి బ్యాంకు డెప్యూటీ జనరల్ మేనేజరు రమేష్ కూడా పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి పౌరుని కర్తవ్యమని, అందువల్ల రెడ్‌క్రాస్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు తాను రక్తదానం చేసినట్టు తెలిపారు. నగరంలో సేవలందిస్తున్న రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్, వాకర్స్ క్లబ్, ధర్మ శాస్త్ర సన్నిధానం ట్రస్టు, బిజీర్ ఫౌండేషన్, మదర్స్ లవ్ ఫౌండేషన్, జిల్ ఫౌండేషన్, మదర్స్ హెల్పింగ్ సొసైటీ, ఆపద్బాంధవ ఫౌండేషన్, ప్రాణధాత ఫౌండేషన్, న్యూ శ్రీకాకుళం రక్త నిధి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్, లైన్స్ రక్త నిధి, విజయశ్రీ రక్తనిధి, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి వంటి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను కొనియాడారు.

విజయోత్సవానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పలాస



జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో పలాస నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నామని, విజయోత్సవ కార్యక్రమానికి కార్యకర్తలు సిద్ధం కావాలని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మరో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎపిఆర్‌జెసిలో మెరిసిన విద్యార్థులు



ప్రజ్ఞప్రియ హర్షిత

కోటబొమ్మాళి : మండలంలోని ఊడికలపాడుకు చెందిన సనపల ప్రజ్ఞప్రియ మంగళవారం విడుదలైన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 32వ ర్యాంకు సాధించింది. అలాగే విజ్ఞాన కోచింగ్ సెంటర్ విద్యార్థులు చాప జోత్న 299వ ర్యాంకు, బి.కీర్తి 367వ ర్యాంకు, బి.లిఖిత్ 674వ ర్యాంకులు సాధించారని నిర్వాహకులు ఎన్.చైతన్య, ఎన్.జగదీష్‌లు తెలిపారు. అలాగే జైహనుమాన్ కోచింగ్ సెంటర్‌కు చెందిన పెద్దిన భవాని 53వ ర్యాంకు, సుంకరి రజిత 143వ ర్యాంకు, పేడాడ నారాయణలు ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచారు. వీరికి ఆ కోచింగ్‌సెంటర్ అధ్యాపకులు సిమ్మన్న, షణ్ముఖరావు అభినందనలు తెలిపారు. తమ పిల్లలకు మంచి ర్యాంకులు రావడంతో తల్లిదండ్రులు కోచింగ్ సెంటర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆమదాలవలస : పట్టణంలోని రెడ్డి క్వార్టర్స్‌కు చెందిన కూన హర్షితకు మంగళవారం విడుదల చేసిన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో 124 మార్కులు సాధించి ఎంపిసి విభాగంలో 135వ ర్యాంకు సాధించింది. తండ్రి కూన నాగు ట్రావెల్స్ సప్లయర్స్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. తల్లి జలజాక్షి మన్యం జిల్లాలోని పాలకొండ కోర్టులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. హర్షిత పట్టణ శివారులోని శ్రీవాణి హైస్కూల్‌లో పదో తరగతి వరకు విద్యను అభ్యసించారు. ఆమెకు పాఠశాల యాజమాన్యం బి.వెంకటేశ్వరరావు రమణమూర్తి, నారాయణరావు అభినందించారు.



అభినందిస్తున్న జోహార్‌ఖాన్

'జ్ఞానభారతి' విద్యార్థుల సత్తా

ఇచ్ఛాపురం: సిబిఎస్‌ఇ పదో తరగతి, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక జ్ఞానభారతి విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ మంగళవారం అభినందించారు. ఈ పరీక్షా ఫలితాల్లో సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు పరీక్షలను ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించారు. 72 మందికి 72 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్టర్ మేనేజర్ అలీమ్ ఖాన్, సయ్యదా సుల్తానా పాల్గొన్నారు.

నేడు ఆమదాలవలస మండల సమావేశం

ఆమదాలవలస : మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిన్నామని అన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరుకావానలి కోరారు. అలాగే ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో మండల అధికారులు హాజరుకావాలని సూచించారు.

క్షతగాత్రులకు పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం చాపురంలో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. వీరు జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహరనాయుడు వేర్వేరుగా మంగళవారం పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సేవల గుర్తించి వైద్యులతో మాట్లాడారు. ఆవేశాలకు లోను కావద్దని వారికి ఇరువురు నాయకులు సూచించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు.



క్షతగాత్రులతో మాట్లాడుతున్న గొండు శంకర్



పొందూరు-సంతకవిటి రైల్వే క్రాసింగ్ వద్ద అవస్థలు పడుతున్న వాహనదారులు

ఎన్నాళ్లీ ఇక్కట్లు!

మండుటెండలో ఉన్న వాహనదారులు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు-సంతకవిటి రహదారిలో రైల్వేక్రాసింగ్ వద్ద గేటు పడిందంటే చాలు వాహనదారులు హడలిపోతున్నారు. రహదారిలో ప్రయాణం చేసే సమయంలో గేటు పడితే ఎంతో సమయం అక్కడే వేచి ఉండాల్సి వస్తుంది. ప్రస్తుతం వేసవి కావడంతో మండుటెండల్లోనే సుమారు 15 నుంచి 20 నిమిషాలు ఉండాల్సి వస్తుందంటూ వాహనదారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సంతకవిటి నుంచి పొందూరు రావాలన్నా, శ్రీకాకుళం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే ఈ రహదారే ఆధారం. ముఖ్యంగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రైల్వే క్రాసింగ్ వల్ల ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందంటూ వాపోతున్నారు. ఆమదాలవలస నుంచి పొందూరు వరకూ సుమారు అన్ని రైల్వేక్రాసింగ్ గేట్‌లు వద్ద అండర్ పాస్‌లను నిర్మించారు. కానీ, ఇక్కడ అండర్‌పాస్ మంజూరైనా కొన్నేళ్లుగా దానికి సంబంధించి ఎటువంటి పనులను చేపట్టలేదు. రైల్వే అధికారులు స్పందించి వేగంగా అండర్‌పాస్ పనులను చేపట్టి వాహనదారుల అవస్థలను తొలగించాలంటూ ప్రయాణికులు కోరుతున్నారు.

సాగునీటి కాలువ

డంపింగ్ యార్డును తలపిస్తున్న

ప్రజాశక్తి - కొత్తూరు

స్థానిక హడ్డుబంగి సాగునీటి కాలువ నివగాం రహదారిలోని సాగునీటి కాలువ ద్వారా సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందించే కాలువ డంపింగ్ యార్డును తలపిస్తుంది. స్థానికంగా ఉన్న హోటళ్లు, దుకాణదారులు, కోళ్ల ఫారం యజమానులు, స్థానికంగా నివాసం ఉంటున్న వారు చెత్తా చెదారాలను కొబ్బరి బొండాలను పారబోస్తున్నారు. సాగునీటి కాలువ డంపింగ్ యార్డులా తయారు కావడంతో కాలువలో పూడిక పేరుకుపోయి దుర్గంధం వేదజల్లుతుంది. దీంతో కాలువకు అనుకోని ఉన్నవారు. అనారోగ్యంతో బారినపడుతున్న సంఘటనలు అనేకం ఉన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి వ్యవసాయానికి సాగునీరు అందే పరిస్థితులు కనిపించడం లేదు. వ్యర్థాలతో సాగునీటి కాలువ ముసుకుపోయింది. ఈ సాగునీటి కాలువ ద్వారా మండల కేంద్రంలో పాటు మహర్తాపురం, సిరుసువాడ, కుంటిభద్ర గ్రామాలకు చెందిన రైతులకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువలో పూడిక పేరుకుపోవడంతో వర్షాలు పడితే రహదారిపైనే నీరు ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రాకపోకలకూ అంతరాయం కలుగుతుంది. ఒక వైపు రైతులు, ఇంకోవైపు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పారబోసే వారిపై కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఏటా ఈ పరిస్థితి



కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

కొనసాగుతుంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల్లో సహకరించిన వారికి కృతజ్ఞతలు

కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సూరిబాబు

జిల్లాలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, ప్రజలకు కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింపజేసేలా ఎన్నికలు నిర్వహించి ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని తరగతుల వారు తోడ్పాటు అందించారన్నారు. క్యూ లైన్లలో ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలకు అసౌకర్యం కలగకుండా స్వచ్ఛంద సంస్థలు సహకరించారన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి యంత్రాంగం కృషి ప్రశంసనీయమన్నారు.

తెరుచుకున్న మద్యం దుకాణాలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు మద్యం షాపులు మూసివేశారు. రెండు రోజుల తరువాత మంగళవారం ఉదయం మద్యం షాపులు తెరుకున్నాయి. మద్యం తాగేవారు ఎండ వేడిమిని లెక్కచేయకుండా మిట్ట మధ్యాహ్నం పూండి ప్రభుత్వ మద్యం దుకాణం ఎదుట క్యూ కట్టారు. ఎక్కువ సంఖ్యలో మద్యం తాగేవారు గుమిగూడటంతో సిబ్బంది క్యూలో వచ్చిన వారికే మద్యం అమ్ముతామని చెప్పడంతో ఎండను సైతం లెక్కచేయకుండా వరుసలో నిలబడ్డారు.



క్యూలో వేచి ఉన్న మద్యం ప్రియులు



పరామర్శిస్తున్న గౌతు శిరీష

టిడిపి కార్యకర్తలపై దాడి

ప్రజాశక్తి - పలాస

మండలంలో అమలకుడియాకు చెందిన టిడిపి కార్యకర్త బూర్జ అప్పలస్వామి అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త తొగరాన వినోద్ క్రికెట్ వికెట్‌తో సోమవారం అర్ధరాత్రి దాడి చేశాడు. బాధితుడు కథనం మేరకు... ఎన్నికల ముందు అప్పలస్వామి నడుచుకుంటూ వస్తుండగా... వినోద్ రాజకీయ పార్టీలపై సంభాషన జరిగింది. సోమవారం రాత్రి బహిర్భూమికి వెళ్తున్నాడు. ముందుగా జరిగిన సంభాషను దృష్టిలో పెట్టుకుని వినోద్ అడ్డగించి క్రికెట్ వికెట్‌తో దాడి చేశాడు. దీంతో తలపై తీవ్రమైన గాయంతో ఇంటికి చేరుకొని 108లో పలాస ప్రభుత్వాస్పత్రిలో చేరారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినబాడాంలో ఇంటికి తాళం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చినబాడాంకు చెందిన పిన్నింటి మన్మథరావు సోమవారం జరిగిన ఎన్నికల్లో టిడిపికి ఓటేసినందుకు వైసిపి నాయకులు ఆయన ఇంటికి తాళం వేశారు. పోలీసుల సమక్షంలో తాళం పగలగొట్టారు. మన్మథరావు విజయనగరంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో తన సొంత గ్రామమైన చినబాడాంలో ఓటేసేందుకు తన భార్య సుజాతతో వచ్చాడు. ఓటు వేసి మంగళవారం ఉదయం తిరిగి విజయనగరం వెళ్లేందుకు ప్రయత్నించగా, అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దువ్వాడ రమణారావు, పొన్నాడ కృష్ణారావు, డిక్కల రాజేష్, డిక్కల నిరంజన్, డిక్కల లక్ష్మణరావు, అంపోలు ప్రసాద్, సనపల రమణ, పి.నిరంజన్, సనపల రవికిరణ్, డిక్కల రామకృష్ణలు టిడిపి ఓటేశావంటూ మన్మథరావు ఇంటికి తాళం

క్రైమ్ కార్నర్

వేశారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకులకు సమాచారం ఇవ్వడంతో గౌతు శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాశీబుగ్గ పోలీసులు సమక్షంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి ఆయనని విజయనగరానికి సాగనింపారు. అలాగే ఎన్నికల పోలింగ్ బూత్‌లో టిడిపి ఏజెంట్‌గా తండ్రీకొడుకులు కోత సాయిచరణ్, శ్రీనివాసరావులు వ్యవహరించారు. సోమవారం అర్ధరాత్రి సాయిచరణపై వైసిపి నాయకులు డిక్కల నిరంజన్, దువ్వాడ రమణరావు, సనపల రవికిరణ్, డిక్కల సాగర్, అట్టాడ ప్రసన్నకుమార్, కూర్మాపు సుందరరావు, పొన్నాడ కృష్ణారావు, డిక్కల రామకృష్ణ, అంపోల ప్రసాద్‌లు దాడి చేశారు. ఆ సమయంలో 100, 108కు సమాచారం ఇవ్వడంతో కాశీబుగ్గ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వైసిపి నాయకులు లేకపోవడంతో వెనుదిరిగారు. వీటిపై కాశీబుగ్గ సిఐ విజయానంద్ వివరణ కోరగా, జరిగిన సంఘటనపై ఫిర్యాదులు వచ్చాయని, పరిశీలిస్తున్నామని తెలిపారు.

అలాగే హరిపురానికి చెందిన టిడిపి కార్యకర్త కనగల రామారావు పోలింగ్ బూత్ ఏజెంట్ వ్యవహరించారు. అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కర్ర అనిల్‌కుమార్ మంగళవారం ఉదయం రామారావుపై దాడి చేశారు. రామారావు వారిపురంలో తన షాపు తెరుస్తుండగా, అదే ప్రాంతంలో ఉన్న అనిల్ పోలింగ్ సమయంలో నా తల్లి ఓటుపై జరిగిన ఘటన ప్రస్తావిస్తూ... ఒక్కసారిగా చేశారు. జరిగిన ఘటనలపై టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష క్షతగాత్రులను పరామర్శించారు. జరిగిన ఘటనలపై ఆరా తీశారు. ఆమెతో పాటు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, పి.విఠల్‌రావు, బి.నాగరాజు ఉన్నారు.

వైసిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబడాంలో డిక్కల నిరంజన్ ఇంటిపై అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సోమవారం అర్ధరాత్రి దాడి చేసి ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. బాధితుడు డిక్కల సాగర్ కథనం మేరకు... అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నాగరాజు, చంద్రమౌళి, అవినాష్ తదితరులు అర్ధరాత్రి సమయంలో ఇంటి వద్దకు వచ్చి తలుపులు కొట్టి దాడి చేశారు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నిరంజన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

గోకర్ణపల్లి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని గోకర్ణపల్లిలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన కొట్లాట సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సర్పంచ్ గ్రూపునకు చెందిన వైసిపి నాయకులు సంపతిరావు సూర్యనారాయణ, చింతాడ జీవరత్నం భాస్కర్‌లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టిడిపి గ్రూపునకు చెందిన సీపాన శ్రీరంగానాయకులతో పాటు మరో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న తమపై పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని కర్రలతోను, రాళ్లతోను దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

గ్రామంలో పోలీస్ పికెట్

మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన గోకర్ణపల్లిలో ఎన్నికలు సందర్భంగా వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య కొట్లాట చోటుచేసుకోవడంతో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రారంభం కాగానే ఇరు గ్రూపుల మధ్యన ఘర్షణ ప్రారంభమైంది. దీంతో గ్రామంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ఎటువంటి వివాదాలు, కొట్లాటలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండి గ్రామంలో శాంతిభద్రతలను నెలకొల్పాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

చిగురువలసలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలోని చిగురువలసలో సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా ఏర్పడిన వివాదాలు మంగళవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో కొట్లాటకు దారి తీశాయి. టిడిపికి చెందిన బసవ ఉమామహేశ్వరరావు, వైసిపికి చెందిన నేతింటి శేఖర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ జరిగిన విషయంలో ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. చిగురువలసలో శాంతిభద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నలుగురికి గాయాలు

పలాస: మండలంలోని లక్ష్మీపురం టోల్ గేట్ సమీపం వజ్రపుకొత్తూరు మండలం వంతెన సమీపంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు, బంధువుల కథనం మేరకు... వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరికి చెందిన లొడగల భీమారావు, జనపాల వసంతు ద్విచక్ర వాహనంపై స్నానం ముగించుకుని వస్తున్నారు. అదే రూట్‌లో సంతబొమ్మాళి మండలం గొదాలంకు చెందిన కె.అశోక్, డొక్కారి కాటయ్య టెక్కలి నుంచి పలాస వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో కె.అశోక్, డొక్కారి కాటయ్య, లొడగల భీమారావు, జనపాల వసంతు తీవ్ర గాయాలు కావడంతో పలాస ప్రభుతాస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు లొడగల కామేశ్వరరావు వారికి పరామర్శించి సరైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.



పరామర్శిస్తున్న కామేశ్వరరావు